













మూడు తులాల బంగారు ఆభరణాల చోరీ

పరవాడ: మండలంలోని గొర్లివాని పాలెం పోర్ట్‌కో లేఅవుట్‌లో నివాసం ఉంటున్న కె.ఎస్.ఎన్. రాజు ఇంట్లో చోరీ జరిగింది. బీరువాలో భద్రపర్చిన మూడు తులాల బంగారు ఆభరణాలు దొంగిలించుకుపోయారని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు.. లేఅవుట్‌లో నివసిస్తున్న కె.ఎస్.ఎన్.రాజు తన కుటుంబంతో ఈ నెల 16న కూతురు ఇంటికి వెళ్లా రు. తిరిగి సోమవారం ఉదయం రాగా ఇంటి తలుపులు తెరచి ఉన్నా యి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో భద్రపర్చిన మూడు తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదని ఇంటి యజమాని రాజు సోమవారం పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఈశ్వరరావు సిబ్బందితో దొంగ తనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. దుండగులు బాత్ రూం వెంటిలేటర్ పగుల గొట్టి ఇంట్లోపలికి ప్రవేశించి చోరీ చేసినట్టు గుర్తించారు. క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు పెద్దపీటపై హర్షం

సింహాచలం: రాష్ట్రంలో ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో బీసీ,ఎస్సీ,ఎస్టీలకు ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. శాసనమండలిలో పెద్ద ఎత్తున అవకాశం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు. పార్టీ బలోపేతానికి పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చి అవకాశం కల్పించారన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజార్టీయే లక్ష్యం

పరవాడ: త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు అధ్యక్షతన సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఓటరు జాబితా, ఓటింగ్‌పై నాయకులకు దిశానిర్దేశం చేశారు. వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు సీహెచ్. ముత్యాలు, పెదిశెట్టి శేఖర్, కలపాక సర్పంచ్ బొండా కనకారావు, కె.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.















వివాదాస్పద స్థల హద్దులు గుర్తించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఈ లలిత

పరవాడ: మండలంలోని పి.బోనంగి గ్రామంలో వివాదాస్పదంగా మారిన ఆర్ అండ్ బీ రహదారి స్థల హద్దులు నిర్ణయించి పరిష్కార మార్గం చూపాలని రోడ్లు భవనాల శాఖ ఏఈ లలిత సోమవారం తహసీల్దార్ ప్రకాశరావును కోరారు. ఈ మేరకు ఆమె సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డును ఆనుకుని గ్రామ పంచాయతీ పాలకవర్గం సీసీ కల్వర్టు నిర్మించాలని యోచించింది. ఇంతలో కల్వర్టు నిర్మాణం చేపడుతున్న స్థలం తనదంటూ మాజీ సర్పంచ్ రాయవరపు దేముడు అడ్డు తగిలారు. దీంతో నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని ఏఈ లలిత కోరారు. ఏఈ వెంట వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకుడు బండారు రాజశేఖర్ ఉన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో వెంకటరావు

సింహాచలం: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ విశాఖ జిల్లా క్యాలెండర్‌ను సోమవారం పెందుర్తి ఎంపీడీవో వెంకటరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సచివాలయ ఉద్యోగులంతా కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం .జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమ వారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.



























అశోక్ దృష్టికి ట్రస్ట్‌బోర్డు అజెండా

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం మార్చి 1న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అజెండాలోని అంశాలను తెలియజేస్తూ సోమవారం దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజును విజయనగరంలోని స్వగృహంలో కలిశారు. మార్చిలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం , ఏప్రిల్‌లో చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, అలాగే వివిధ పనులకు సంబంధించి సమారు 40 అంశాలతో దేవస్థానం అధికారులు అజెండా సిద్ధం చేశారు. ఈ మేరకు వాటిపై ముందస్తుగా చర్చ జరగాలని, ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు దినేష్ రాజ్, శ్రీదేవి, శ్రీనివాసరావు అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు సంబంధిత అంజెండాతో అశోక్‌గజపతిరాజును కలిశారు. ఈ మేరకు వచ్చే నెల 1న సమావేశం నిర్వహించేందుకు ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.


అజెండా పరిశీలిస్తున్న అశోక్ గజపతిరాజు

నేడు కృష్ణరాయపురంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ జన్మదిన వేడుకలు

సింహాచలం: ఎమ్మెల్యే అన్నంరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం వేపగుంట సమీపంలోని కృష్ణరాయపురంలోని బొడ్డపాటి ఎస్టేట్స్‌లో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 4.30 గంటల నుంచి ఎమ్మెల్యే సభావేదిక వద్ద అందరికీ అందుబాటులో ఉంటారని పేర్కొంది. పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని కోరింది.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం


మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

సింహాచలం: విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్రస్థాయి అధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ప్రతీరోజు గంట సమయం ఆటలకు కేటాయించాలని సూచించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య అభ్యసించడానికి, ఉద్యోగాలు పొందడానికి అవకాశం కలుగుతుందని తెలియజేశారు. సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ లను ఉదాహరణగా చెప్పి విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగించారు. ప్రతీరోజు షూస్, యూనిఫాం, ఇన్‌షర్ట్ ధరించి పాఠశాలకు రావాలని, హెయిర్ కటింగ్ చక్కగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: 11కేవీ పరిధిలోని దెబ్బతిన్న పాత విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు మార్పు చేయనున్న దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ గోపాలపట్నం రూరల్ ఏఈ డీవీఎల్ కుమార్ తెలిపారు. 93వ వార్డు పరిధిలోని గణేష్‌కాలనీ, శ్రీనివాసనగర్, ప్రహ్లాదపురం, గొల్లనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఉయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లిలో చేపట్టిన కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో 95వవార్డు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సంతోష్, నాయకులు దేముడుబాబు,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

మహారాణిపేట: రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు మంగళవారం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వస్తున్నారు. ఉదయం 5.35 గంటలకు విశాఖ నగరంలో కిర్లంపూడి లేఅవుట్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారు. మంగళవారం రాత్రి 11 గంటలకు ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి విజయవాడ వెళతారు.